దినచర్య

శ్రీ కె. వి. రావుగారు ఎం. ఏ.

ఇంటి దగ్గరందరూ కులాసాగాయున్నారా? కాళ్లు కడుగుక్కోండి” అంటూ మా అత్తగారు తలుపు చాటు నుండి అప్పుడేవచ్చి కుర్చీలో కూచోబోతూ ఉన్న నన్ను యోగక్షేమాలు అడుగుట మొదలు పెట్టినారు. అప్పుడే సాయంత్రం ఆరున్నర అవుతుంది; 5 గంటలకు రావలసినరైలు ఒకగంట ఆలస్యం. పెండ్లి అయినప్పటి నుంచీ నేను తరుచువస్తున్నా. ఎదురగా నిలబడి మాట్లాడడానికి ఆవిడకూసిగ్గే నాకూసిగ్గే—ఆవిడ మొగం ఏలా ఉంటుందో యిప్పటికి నాకు తెలియదు. తలయెత్తిమాట్లాడలేనుగా నేను. మా అత్తవారు నన్ను పిలుచుటగాని, ఫలానా అప్పుడు వస్తున్నానని నేను ముందు వ్రాయుటగాని మాకు అలవాటులేదు. అందుచేత ఆదినం వస్తానని ఆవిడకు తెలియదు. “ఎసరు కాగింది వస్తాను”అని ‘జానకీ’ అని పిలచి ఆవిడ లోపలకు వెళ్లినారు.

ఇంతలో మా మరదలువచ్చి “జానకక్కయ్య లోపలుంది రా”అని చేయిపట్టుకొని గదిలోపలికి తీసుకొని వెళ్లింది. అంతఃపురప్రవేశం అయిన 5 నిముషాలలో మాజానీ—మా ఆవిడ ముద్దుపేరులెండి—వేడి వేడి ఓవల్‌టిన్‌తో ప్రవేశించింది. మరి పది నిముషాలకు మాపెద్ద మరదలువచ్చి“బావా నీళ్లుకాగినాయట స్నానం చెయ్యవచ్చును”అంది. స్నానానంతరం మా చిన్నబావమరిదివచ్చి “బావా, బావా, మరేం, నాన్నగారు వచ్చేటప్పటికి ఆలస్యం అవుతుందిట. అమ్మ మనల్ని భోజనం చేయమంటోంది”అన్నాడు భోజనానంతరం కాస్సేపు దగ్గరచేరిన మా బావమరదులకు మరదలకూ కథ చెప్తుంటే, సరిగా ఆకథ అయ్యేసరికి వాళ్లను లోపలనుంచి కబురు సావిట్లో చదువుకోమని—మా అత్తగారికి తెలుసు, కొంత కాలానికి కలుసుకొన్న భార్యాభర్తలు ఏకాంతం అభిలషిస్తారని.

మా అత్తగారినిచూస్తే నాకు భక్తి, గౌరవం, ఆశ్చర్యం. ఆవిడపనిలోచాకచక్యం, ఇంటిలోపొదుపు, ఇతరుల మనస్సులో విషయాలు త్రుటిలో గ్రహించుట ఆవిడవినయం ఇవన్నీ నాకాశ్చర్యం కలిగిస్తాయి. వచ్చేనో లేదో అంతలో ఫలహారం అంతలో స్నానం, భోజనం, ఆవిడంత చురుకుగా పనిచేసేవాళ్లను చూడలేదు. అల్లుళ్ల విషయంలో అత్తలందరూ యీలాగే ఉంటారంటారేమో. ఆసంగతటుంచి మా అత్తగారు అన్ని విషయాలలోనూ అడేనేర్పూ, ఓర్పూ, తెలివీ, చాకచక్యం చూపిస్తారు.

ప్రొద్దున్నే 5 గంటలకు దాసీ వస్తుంది. అప్పుడే ఆవిడాలేచి యింటిపని దగ్గరఉండి చేయిస్తూ తనపని తను చూచుకుంటూ దైనిక జీవితం మొదలుపెడ్తుంది. మా అత్తవారు అంత శ్రీమంతులు కారుకాని ఏదో లోటులేకుండగా బాగానేఉంది. మామగారికి గవర్నమెంటులో ఒకచిన్న ఉద్యోగం కనుక ఆవిడకూడా ఏదో సాధారణ గృహిణివలె కొద్దో గొప్పో పనులు చేయవలెగదా! ఇంతలో ఆఖరు అబ్బాయి,అమ్మాయి-యిద్దరూ ఒకేమంచంమీద పడక-తగవు ప్రారంభించినారు. స్థలం కోసం అది కొంచెం ఎక్కువఅయి గుద్దులాటలలోకి దిగింది. ఆవిడ ఎప్పుడు విందో తక్షణం గబగబావచ్చి “అల్లరి చెయ్యకమ్మా, నాన్నగారు లేస్తారు. నువ్వుండమ్మా మంచివానవుకదూ, నువ్వు నామంచంమీద పడుకో.”అని వాళ్లను సముదాయించి వాళ్లు పారవైచిన తలగడాలు మరలచేర్చి ఆలా వెళ్లిందో లేదో యింతలో చంటిపిల్ల ఏడుపు ప్రారంభించింది. పాపం ఆవిడ మళ్లావచ్చి పాలిచ్చి సముదాయిస్తూనే “జానీ కాఫీపొడుము వెయ్యమ్మా, నీళ్లు యీపాటికి కాగి ఉంటాయి”అంది. ఈ ఆడవాళ్ళకు అద్భుతమైన తెలివి తేటలు యిచ్చేడు భగవంతుడు. వాళ్లు వంటచేస్తూ పిల్లాడిమీద కూడా ధ్యానం; పిల్లాడ్ని ఒకమూల సముదాయిస్తూంటే కాఫీ

సంగతి జ్ఞాపకం; మరి పదినిముషాలలో నాకూ మామ గారికీ (Bed-coffee) తయారు.

"లేవరా రామూ, 7 గంటలు అయిపోయింది అందరూ స్కూలుకు వెళ్తున్నారు. వేళయింది" అంటూ పెద్దబ్బాయిని లేపి—మా పెద్దబావమరది ఘోషస్తుఘోరం చదువుచున్నాడు ప్రొద్దున్నే నిద్దుర లేవడంలో అతనికి అంతగా నమ్మకం లేదు—ఆ ఆఖరు ప్రక్క ఎత్తే యింతలో "చూడవే అమ్మా నేను పేడపట్టి పళ్లుతోముకుంటున్నానుట చిన్నక్కయ్య అంటూంది" అంటూ బుల్లి బావమరది సగం కడిగిన ముఖం చేతిలో కచ్చికా తయ్యారు మా మఱదలకు కచ్చిక పనికిరాదు—అది పేడనుంచి చేస్తారుట—నంజన్‌గూడ్ పొడరుపట్టి మొగం కడుగుతుంది "లేదమ్మా అది యిటిక పొడుము ఉపయోగిస్తోంది. కచ్చికేమంచిది" అని సముదాయిస్తే ఇద్దరూ నాది మంచిది నా మంచిదంటూ మరల మొగము కడుగుట ప్రారంభించినారు. "నాది పేడలో నుంచి చేసారు. భూదేవి మంచిది మనకు వళ్లుయిస్తుంది" అంది. మరదలు "పేడ ఆవులోంచి వస్తుంది. ఆవు మంచిది 'ఆవు పాలనిచ్చును' అని పాఠం వప్పగించినాడు బావమరది. "కాదు పుడక మంచిది మామాష్టరుగారు చెప్పినారు" అంటూ కళ్లు నులుపుకుంటూ పుడక నములుతూ అప్పుడే లేచిన రామూ ప్రవేశించినాడు "అయ్యో మాష్టారంటే జ్ఞాపకం వచ్చింది లెఖలు చెయ్యాలి" అంటూ మరదలు పారిపోయింది తుర్రున లోపలికి.

"నీళ్లకు ఎవరు ముందువస్తారో వాళ్లు నా బంగారు తండ్రులు" అంటూ యింతలో అత్తగారిమాట; నేనంటే నేనని కుఱ్ఱాళ్లిద్దరూ సిద్ధం. వాళ్లిద్దరకూ నీళ్లుపోసి "జానకీ చెల్లాయేదే" అన్నారు. మా మఱదలు యింకా లెఖలు చేస్తూనేఉంది "రావే 7 గంటలు అవ్వస్తోంది" అని అమ్మ అంటే "అబ్బా లెఖలు చెయ్యాలి బాబూ నేను 10 గంటలకు స్నానం చేస్తానే" అంటూ విసుక్కుంటోంది చిన్న మఱదలు. అంతలో అన్నాలహడావిడి; మగపిల్లలిద్దరూ కూర్చున్నారు. మఱదలు వెళ్లలేదు.

"పోనీ అన్నమన్నా తినవే మాయదారి లెఖలు" అంటే చివరకు చిత్తుపుస్తకం పెన్సిల్ తాను తయారయింది మఱదలు. నెమ్మదిగా తింటూఉన్నారు.

"అమ్మా పెరుగు" అన్నాడు పెద్దవాడు.

"అమ్మా నాలుగుఏళ్లు ఎంతే" అని అడుగుతోంది చిన్నమరదలు అన్నంతింటోనే లెఖలు చేస్తోంది.

"వస్తున్నా, 28" అంటూ యిద్దరకూ సమాధానం చెప్తు ఉట్టిమీద పెరుగుగిన్నె తీస్తున్నారు ఆవిడ.

"7½ అయింది త్వరగా పొయ్యవే దానికి లెఖలు తరువాత చెప్తువు గాని."

"మరే నిన్న 7 గంటలకు లేవమన్నారు గాబోలు."

"దాన్ని రాత్రి చెయ్యవద్దన్నారు గాబోలు."

"మరి రాత్రి బావ రాలేదేమిటి?" అని మరదలు వంక చెప్పింది.

ఇంతలో "అమ్మా పాలు తియ్యండి." అంటూ వకరూ "అంట్లు తియ్యండి" అంటూ వకరు "వంకాయలు వచ్చేయి కావాలా" అంటూ మామగారికేక అన్నాలు పెడ్తూ అందరకూ సమాధానం చెప్తూనే ఉన్నారు ఆవిడగారు గృహలక్ష్ములు అష్టావధానం చెయ్యాలిగదా యీవిషయాల్లో.

అమ్మాయీ పెద్దవాడూ తిన్నారు గాని చిన్నవాడు యింకా ఆవకాయకలుపుతున్నాడు. "అదేమిటిరా త్వరగా తిను మరి" అంది అమ్మ "త్వరగా తినకూడదు. బాగా నమలితినమన్నారు మా మాష్టరుగారు" అని అతని జవాబు. పని తొందరలో అతనికి నమ్మకం లేదు. అన్ని పనులూ సావకాశంగా చేస్తాడు. "అమ్మ మేం వెడ్తున్నాం టైంఅయింది తమ్ముడికోసం ఉండం" అని ఒక్కపరుగులో వెళ్లినారు స్కూలుకు పిల్లలిద్దరునూ. "ఉండరా నేనయినా తినిపిస్తాను" అని కూర్చొని తినిపిస్తూంటే గిన్నెచప్పుడు "అమ్మాయీ జానకీ, పాలగిన్ని తియ్యమ్మ పాడుపిల్లి వస్తోంది... ఉప్మా నీళ్లు మరిగినాయేమోచూడు" అంటూ అన్నం

తినిపించి పిల్లవాడికి మంచిబట్టలు తొడుగుతూ "రామం ఆవర్టుతోనే స్కూలుకు వెళ్లినాడు గాబోలు చెప్మా" అనుకుంటూ దాసీ దాన్నిచ్చి పిల్లాడిని స్కూలుకు పంపించింది ఆయిల్లాలు. ఇది ఆవిడ టైంటేబిల్లో ఫస్టుపీరీడు.

కొంత హడావిడి తగ్గింది; ఇంతవరకూ చంటిపిల్ల లేవలేదు. ఒకసారి వెళ్లిచూచి ఉప్మాకాఫీ మామగారికిచ్చి నాకు పంపించి తను జడవేసుకొని జానకికి వేసి స్నానానికి వెళ్లేసరికి ఎనిమిదన్నర అయింది. ఒక గంటలో వంటకావాలి. మామగారు కచేరికి వెళ్లాలి. గబగబా చేస్తోంది "అది ఎంతకూ ఉడకదమ్మా యీ పాడు దుంపలు; పాపం! ఎప్పుడూ ఆయనకు హడావిడి భోజనమే. ప్రొద్దున్న సావకాశం ఎప్పుడూ పెట్టనే లేదమ్మా" అని తనలో తనను నిందించుకుంటూనే పప్పు, కూరా, పచ్చడి, పులుసుచేసి మామగారికి భోజనంపెట్టి, దగ్గరకూర్చొని అన్నం చల్లారేవరకూ విసరి భోజనం అవగానే తమలపాకులు చుట్టియిచ్చి పెట్టెలో చాకింటిబట్టలు యిచ్చి ఆయనను గుమ్మం వరకూ సాగనంపి మరల వంటయింటిలో ప్రవేశించేటప్పటికి పదిగంటలు అయింది ఇది రెండవ పీరీడు.

నేనప్పుడు ఉదయం భోజనం మామగారితో చెయ్యలేదు "ఈ హడావిడ భోజనం అతనికికూడా ఎందుకే? కాస్సేపుండి సావకాశంగా యిద్దరూ తిందురుగాని" అని కూతురుతో చెప్పుతుంది ఆవిడ. పైగా నేను సావకాశంగాలేచి స్నానంచేసి ఫలహారం చేసేసరికి మామగారి భోజనవేళ అవుతుంది—అత్తవారిల్లు గదా నాకు.

మరల నాకోసంగా ప్రత్యేకం ఒక వేపుడుకూరచేసి పీటలువేసేసరికి మరల పదిన్నర అవుటబట్టి పిల్లలు తయ్యారు. మరల యిల్లు కలకలలాడుతోంది. "అమ్మోయ్ ఇవ్వాళ లెఖలు చెయ్యలేదని ఒక తాయిలారుని మాష్టారు తిట్టేరేవ్" అన్నాడు చిన్నాడు. "ఆలస్యంగా వచ్చినందుకు మనకు మాత్రం తగలలేదు లావుంది" అని రెట్టించింది అమ్మాయి. దానిచేత స్నానంచేయించి మాకందరకూ అన్నాలు పెట్టేసరికి పదకొండు దాటింది. "బావదగ్గర నేను కూర్చోవాలి" అని వాళ్లలోవాళ్లకు తగవు. ఒక ప్రక్కని పూటకు ఒకరు కూర్చోడానికి సమాధానం చేసింది ఆవిడ.

"రెండో ప్రక్కో" అంది మరదలు.

"అక్కయ్య."

"అయితే అమ్మా, అక్కయ్యకు బావ ఏమి అవుతాడే" అని చిన్నవాడి సందేహం!

"అదేమిటోయ్ అన్నీ ఆలా గగబెట్టుతున్నావు. సహించడంలేదా ఏమిటి? నాకు వంట చేతగాదమ్మా" అంటూ వద్దంటూఉన్నా అన్ని ఎక్కువ వడ్డిస్తూ ఉంటారు.

భోజనాలు అవగానే—పదకొండున్నర దాటింది. ఆవిడకూడా భోజనంచేసేసరికి పాపం పన్నెండు అవ వచ్చింది. అప్పుడప్పుడు ఒకసారివెళ్లి చూస్తూఉన్నా పాపం, చంటిపిల్లని కాస్తసముదాయించటానికి తీరుబడి లేదావిడకు. అప్పుడు వెళ్లి పిల్లదగ్గర పరుండేసరికి "అమ్మా చూడవే నాపలక పుల్ల అక్కయ్య ఎక్కడో పారేసింది" "లేకపోతే నాపుస్తకం ఎందుకు ముట్టుకోవాలి వద్దంటోంటే" అని చిన్నచిన్న తగవులు తీర్చేసరికి ఒంటిగంటన్నర అయింది. పిల్లలకు తలలుదువ్వి రామానికి క్రొత్తపర్టుతొడగి వాళ్లను బడికి పంపించి "అయ్యో బంట్రోతువచ్చే వేళఅయింది" అంటూ దబ్బున కాఫీపెట్టి టిఫిన్ చేసి వచ్చినబంట్రోతుచేత మామగారికి ఫలహారం పంపేసరికి రెండుగంటలు అయ్యింది. మరల హడావిడి తగ్గింది. ఇది ఆవిడ దినచర్యలో మూడవభాగం.

కాస్సేపు విశ్రాంతి. చంటిపిల్లను ప్రక్కలో వేసుకొని కొంచెంసేపు నిద్రపోయిందో లేదో యింతలో "అమ్మగారూ ఉత్తరం" అంటూ తపాలబంట్రోతు పాపం నిద్రాభంగంచేసేడు. "అయ్యో అప్పుడే మూడు అయింది గాబోలు ఎంతసేపు నిద్రపోయానో జానకీ మీ ఆయనకు ఫలహారం యియ్యవే" అంటూ

లేచింది. ఎప్పుడు చేసేరో లేక బజారునుంచి తెప్పించారో, నాకు మాత్రం మంచి ఫలహారం దొరికింది. "మీ ఆయన వింటారు ఫిడేల్ మీద రెండుపాటలు పాడవే"అని జానకికి ఫలహారనిచ్చి ఆవిడ మరల దినచర్య ప్రారంభించింది.

పిల్లల చొక్కాలకు బొత్తములుకుట్టుట చంటి పిల్లకు ఊలుస్టాకింగులో భర్తకు జేబు రుమాలుమీద రంగులతలు కుట్టుట మొదలగు పనులతో కూర్చుంటే నాలుగు గంటలు అయింది "పిల్లలువచ్చే వేళయింది ఏమయినవా పెట్టమంటారు" అంటూ హడావిడిగా కొబ్బరికాయలుకొట్టి బాగుగా కోరుచేసి పంచదార చల్లి మూడు వెండిపళ్లెములలో సిద్ధంగా ఉంచేసరికి బడినుండి పిల్లలువచ్చి ఫలహారంచేసి, పెద్దవాడు బంతి ఆటకు వెళ్లేడు. చిన్నవాళ్లిద్దరూ కేరమ్స్ ఆడుతున్నారు. యింట్లో చంటిపిల్ల ఏడుస్తోంది. నేను షికారు వెళ్లేను. ఐదుగంటలకు ఆవిడ మడిగట్టుకొనుటకు సిద్ధముగా యున్నారు. ఇది నాలుగవభాగం.

ఆరున్నర గంటలకు మరల నేను యింటికి వచ్చేసరికి మామగారు పేపరు చదువుతున్నారు. పిల్లలెవ్వరూ కనుపించలేదు. మా ఆవిడమాత్రం మందహాసం చేస్తూవచ్చింది. "పిల్లలేరి"అని అడిగినాను. "భోజనం చేస్తున్నారు." "అప్పుడేనా" "అవును సాయంత్రం మా అమ్మ వాళ్లందరకూ కలిపితినిపిస్తుంది."

"నాక్కూడా కలిపి తినుపించకూడదు నువ్వు?"

"పాపం! మీరు బొత్తిగా చిన్నపిల్లలు. ఎత్తుకొని తినిపించాలిగూడాను" అంటూ మాజానీ నాస్నానానికి సబ్బు తువ్వాలు పట్టుకొని వెళ్లింది.

రాత్రి భోజనానికి నేనూ, మామగారు జానీ మాత్రమే. నేను లేకపోతే జానీకికూడా ముందర పెట్టేసి భార్యా భర్తలు కూర్చుంటారుట. భోజనం దగ్గర మామగారితో మాట్లాడే విషయాలు నాకంతగా కనుపించలేదు. అందరి భోజనాలు అయ్యేసరికి ఎనిమిది గంటలు అయినది. ఇంతలో పిల్లలు చదువు చాలించి మంచాలకోసం తగవులాడుకుంటున్నారు.

"నేను తమ్ముడిదగ్గర పడుకోను. రాత్రి కుమ్ముతాడే" అంటోంది మా మరదలు.

"నా తలగడా ఏదే అమ్మా" అని రామం చికాకుపడుతున్నాడు. వీళ్లందరినీ సముదాయించి ప్రక్కలు వేసి ఆఖరివాడికి కథ చెప్పి నిద్దురపుచ్చే సరికి దరిదాపు ఎనిమిదన్నర దాటింది. ఇల్లంతా సర్దుకొనేసరికి తొమ్మిదిగంటలు. ఇవి ఆఖరు పీరీడు.

"ఏమండీ స్వరూప్ రాణీ పోయిందట నిజమేనా" అని భర్తకు మరల తమలపాకులు అందిస్తూ అడిగింది మా అత్తగారు.

"అవును."

"పోనీ లెండి. అదృష్టవంతురాలు. అటువంటి కొడుకుని గంది."

"ఏమో నీ కొడుకూ అంతవాడవుతాడేమో" అన్నారు మామగారు నవ్వుతూ.

"అంత అదృష్టంగూడానా?" ఏమో తన కొడుకు అంతవాడు అవతాడేమో. మాతృమూర్తికి తన సంతానవిషయంలో ఎంత ఆశలు గలుగునో ఎవ్వరు చెప్పగలరు—ఏమో? కాని యింతలో కళ్లనీళ్లు పెట్టింది ఆవిడ.

"చిట్టినాయన బ్రతికిఉంటే అంతవాడు అవునేమో?" అని విచారించింది.

అత్తగారికి ఒక కుమారుడు పోయినాడు. మరల ఎంతమంది పుట్టినా ఆ మాతృగర్భమునకు ఆ వేదన పోలేదు. ఆ లోటు తీరలేదు. ఇంతలో ఏమిటో జ్ఞాపకంవచ్చింది. "అన్నట్టు అతనికి పాలు యివ్వలేదు. జానకీ యీ గ్లాస్కు పాలు తీసుకొని మీగదిలో ఉంచుకో" అంది. ఆవేదనలోకూడా అల్లుడి సంగతి మరపురాదు! చెప్పేనుగదూ ఆడవారు అష్టావధానం చేస్తారని. ఆంగ్లేయులకు యింత ఆదరణచేసే అత్తగార్లుండరు. అందుకే హైందవయువకులకు అత్తగార్లంటే విందు, ఆంగ్లేయులకు చికాకు.

నేను చూచినంతవరకు మా అత్తగారి దినచర్య సమాప్తము. మా ఆవిడ నెమ్మదిగావచ్చి మా గది తలుపు వేసేసింది.